నిధులు లేవు.. నీళ్లు రావు..!



ముళ్ల కంపతో నిండిపోయిన పత్తికొండ జలాశయం


వైసీపీ ప్రభుత్వ హయాంలో గంపెడు మట్టి తీయలేదు. ఐదేళ్ల నిర్లక్ష్యం కరువు రైతులకు శాపంగా మారింది. హంద్రీ నీవా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పత్తికొండ (పంది కోన) జలాశయం సహా కుడి, ఎడమ కాలువలను అసంపూర్తిగా వదిలేశారు. రూ.210 కోట్లు ఖర్చు చేస్తే 42,894 ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చు. కానీ నిధులు ఇవ్వడం లేదు. హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ సరే.. పంట కాలువలను పట్టించుకోరా..? అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నేడు జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పత్తికొండ నియోజకవర్గంలో హంద్రీ నీవా కాలువను సందర్శించనున్నారు. కాలువ విస్తరణ పనులను పరిశీలిస్తారు. ఇప్పటికైనా మా సమస్యలు పట్టించుకోరా? అని పత్తికొండ జలాశయం కుడి, ఎడమ కాలువ ఆయకట్టు రైతులు ఆగ్రహంతో ఉన్నారు.

- హంద్రీ నీవా పంట కాలువలపై అంతులేని నిర్లక్ష్యం
- అసంపూర్తిగా పత్తికొండ జలాశయం, కుడి ఎడమ కాలువలు
- గత వైసీపీ హయాంలో ఒక్కపైసా ఇవ్వని వైనం
- టీడీపీ ప్రభుత్వంపై ఆశలు
- రూ.230 కోట్లు ఇస్తే 45 వేల ఎకరాలకు సాగునీరు
- నేడు హంద్రీ నీవా కాలువను సందర్శించనున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు

కర్నూలు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హంద్రీ నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ద్వారా శ్రీశైలం జలాశయం ఎగువన 40 టీఎంసీలు కృష్ణా వరద జలాలు ఎత్తిపోసి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు అందించాలి. ఫేజ్-1 కింద ఉమ్మడి కర్నూలు జిల్లా మాల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కిలో మీటర్లు ప్రధాన కాలువ, కర్నూలు జిల్లాలో కృష్ణగిరి, పత్తికొండ జలాశయాలు, అనంతపురం జిల్లాలో జీడిపల్లి జలాశయం నిర్మించారు. జిల్లాలో 7.5 టీఎంసీలు వినియోగించుకొని 80 వేల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు ఇవ్వాల్సి ఉంది. వానలొస్తే తప్ప పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలు నేల తడవని మెట్టప్రాంతం. ఏటేటా కరువు దరువేస్తోంది. ఉత్తర కార్తె దాటిందంటే ఎత్తర గంప అంటూ రైతులు, కూలీలు వలసలు వెళ్లక తప్పని దైన్య పరిస్థితి. సాగునీటి వసతి లేని ఈ ప్రాంతంలో పత్తికొండ (పందికోన) జలశయం నిర్మించి 61,394 ఎకరాలకు సాగునీరు ఇస్తామంటే.. తమ కష్టాలు తీరుతాయని రైతులు జీనాధారమైన పంట పొలాలు త్యాగం చేశారు. కానీ ఇప్పటికీ మిగిలిన పంట చేలను తడిపే పిల్ల కాలువలు అసంపూర్తిగా వదిలేశారు. ఈ ఇరవై ఏళ్లలో అధికారంలోకి వచ్చిన అన్ని ప్రభుత్వాలూ నిర్లక్ష్యంగానే వ్యవహరించాయి. కూటమి ప్రభుత్వమైనా దృష్టి సారించి అసంపూర్తి పనులు పూర్తి చేసి సాగునీరు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

నిధులిస్తేనే నీళ్లు..!:

హంద్రీ నీవా ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 7.5 టీఎంసీలు నీటిని వినియోగించుకొని 80 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. పత్తికొండ (పందికోన) జలాశయం కుడి కాలువ (ఆర్‌బీసీ) పరిధిలో 50,626 ఎకరాలు, ఎడమ కాలువ (ఎల్‌బీసీ) పరిధిలో 10,774 ఎకరాలు కలిపి 61,400 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. ప్రస్తుతం 18,500 ఎకరాలకు మించి సాగునీరు ఇవ్వడం లేదు. పిల్ల కాలువలు పూర్తి చేస్తే పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో పలు గ్రామాలు పచ్చని పైర్లతో సస్యశ్యామలం అవుతాయి. కరువు తీరుతుంది. వలసలు ఆగిపోతాయి. కీలకమైన పంట కాలువల పూర్తి చేయడంలో పాలకుల నిర్లక్ష్యం రైతులను శాపాలై వెంటాడుతున్నాయి. 1.216 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన పత్తికొండ జలాశయం రాతి పరుపు (స్టోన్ రివిట్‌మెంట్), కడ తూము వంటి పనులు సహా ఎడమ కాలువ పరిధిలో సింగిల్ లైన్ బిడ్జి (ఎస్‌ఎల్‌బీ), ఆర్‌బీసీ, ఫీల్డ్ చానల్స్, డిస్ట్రిబ్యూటరీలు, కుడి కాలువ (ఆర్‌బీసీ) పరిధిలో దేవనకొండ, ఆస్పరి మండలాల్లో డిస్ట్రిబ్యూటర్లు, ఫీల్డ్ చానల్స్, ఆర్‌అండ్‌బీ క్రాసింగ్ బిడ్జిలు, ఎల్‌బీసీ.. వంటి నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.161 కోట్లు ఇవ్వండని పలుమార్లు ప్రతిపాదనలు పంపితే.. ఒక్క పైసా ఇవ్వలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక అంచనా వ్యయం రూ.210 కోట్లకు చేరింది. నిధులిస్తే 42,894 ఎకరాలకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉంది. నిధులు ఇచ్చి నీళ్లు ఇస్తారా..? లేదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.



పత్తికొండ జలాశయం కుడి కాలువ దుస్థితి



దేవనకొండ మండలంలో పంట కాలువ ఇలా

ప్రధాన కాలువ విస్తరణ

ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులు. ప్రస్తుతం 2 వేల క్యూసెక్కులు కూడా తీసుకోలేని పరిస్థితి ఉంది. ఫేజ్-1 కింద 3,850 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి వీలుగా ప్రధాన కాలువ విస్తరణ పనులు రూ.1,030 కోట్లతో గత టీడీపీ ప్రభుత్వం చేపట్టింది. దాదాపుగా రూ.300 కోట్లు విలువైన మట్టి పనులు చేశారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. ఐదేళ్లు గంపెడు మట్టి కూడా తీయలేదు. పైగా 6,300 క్యూసెక్కుల విస్తరిస్తామంటూ రూ.6,182.19 కోట్లతో టెండర్లు పిలిచి వదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గత టీడీపీ ప్రభుత్వం చేపట్టి ఆగిపోయిన బ్యాలెన్స్ విస్తరణ పనులను రూ.695 కోట్లతో మొదలు పెట్టారు. ఫేజ్-2 కింద అనంతపురం జిల్లాలో రూ.1,405 కోట్లతో సీసీ లైనింగ్ పనులు చేపట్టారు. పత్తికొండ నియోజకవర్గంలో జరుగుతున్న విస్తరణ పనులను జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నేడు పరిశీలించనున్నారు. ప్రధాన కాలువ విస్తరణ పనులు సరే.. అసంపూర్తిగా వదిలేసిన పత్తికొండ జలాశయం కుడి, ఎడమ కాల్వలపై దృష్టి సారించి అన్నదాతలకు అండగా నిలవాలని కోరుతున్నారు.

మిగతా 7వ పేజీలో

ఈ-స్టాంపుల్లో ఇష్టారాజ్యం

- అరకొరగా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల సరఫరా
- బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయం



కల్లూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నాన్ జ్యుడీషియల్ స్టాంపుల క్రయ, విక్రయాలకు మంగళం పాడింది. వాటి స్థానంలో ఈ-స్టాంపు పత్రాలను తెచ్చింది. అంతే కాకుండా స్టాక్ హోల్డింగ్ ఏజెన్సీ ద్వారా స్టాంపువెండర్లతో విక్రయిం చేందుకు గతంలో జగన్ సర్కార్ చర్యలు తీసుకుంది. ఈ-స్టాంపింగ్ విధానం అమల్లోకి వచ్చాక నాన్ జుడిషియల్ స్టాంపులు దొరకడం గగనమైంది. అయా విలువలతో ముద్రించే స్టాంపులు అందుబాటులో లేకపోవడంతో క్రయ, విక్రయదారులు ఈ-స్టాంపింగ్‌పైనే ఆధారపడాల్సి వచ్చింది. ఈ క్రమంలో వీటి అమ్మకాల్లో పెద్దఎత్తున లొసుగులు బయటకు వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ విధానాలపై ప్రజల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో ఎన్నికల ముందు కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ-స్టాంపు ప్రక్రియను తొలగిస్తామని సూచించారు. అదేవిధంగా నాన్ జ్యుడీషియల్ స్టాంపులను అందుబాటులోకి తీసుకువచ్చి స్థిరాస్థి వ్యాపారులు, క్రయ,విక్రయదారుల అందజేస్తామని ప్రకటించింది. అందులో భాగంగా కర్నూలు జిల్లాకు అక్టోబరు 2024లో 32వేలు, ఫిబ్రవరి 2025లో 24వేల స్టాంపులను కేటాయించారు..అధికారులు వాటిని జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు స్టాంపు వెండర్లకు పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రూ.100 మినహా స్టాంపులన్నీ ఖాళీ అయ్యాయి. దాదాపు మూడు నెలలకు పైగా స్టాంపులు లేకపోవడంతో వీటి అమ్మకాలు దాదాపు నిలిచి పోయాయి. కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రస్తుతం రూ.10, 20, 50 రూపాయల నాన్ జ్యుడీషియల్ స్టాంపులు లభించని పరిస్థితి నెలకొంది.

ఈ-చలాన్ కట్టాల్సిందే..

ప్రజలు ఈ-చలాన్ కడితేనే ఈ-స్టాంపు ఇస్తున్నారు. స్టాంపు వెండర్లకు ఏజెన్సీ టార్గెట్ పెట్టిమరీ ఈ-చలాన్ కట్టిస్తున్నట్లు విమర్శలున్నాయి. గతంలో ప్రజలు సీఎఫ్ఎంఎస్, బ్యాంకులో చలానా ఇచ్చేవిధానం అమలులో ఉండేది. ప్రస్తుతం ఈవిధానానికి దాదాపు స్వస్తి పలికినట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతి రోజు దాదాపు 350-500 రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఈ-స్టాంపు పత్రాల జారీకి గత ప్రభుత్వం కర్నూలుకు చెందిన ఒక స్టాక్ హోల్డింగ్ సంస్థకు ఏజెన్సీ కట్టబెట్టింది. సదరు ఏజెన్సీ తాను ఏర్పాటు చేసుకున్న స్టాంపువెండర్ల ద్వారా డిమాండును బట్టి ఈ-స్టాంపు పత్రాలు అమ్ముతూవస్తోంది. రిజిస్ట్రేషన్ల కోసం కొనుగోలుదారులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన చలానాను కూడా ఈ-స్టాంపు పత్రాలు అమ్మే స్టాక్ హోల్డింగ్ ఏజెన్సీకే చెల్లించాలని.. లేకుంటే ఈ-స్టాంపు ఇవ్వకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మొత్తంమీద రేట్లుపెంచి కృత్రిమకొరత సృష్టించి అక్రమంగా ఈ-స్టాంపు పత్రాలను ఎక్కువ మొత్తాన్ని వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. కృత్రిమ కొరత వల్ల రూ.10, 20, 50 స్టాంపులు దొరకడం లేదు. కేవలం రూ.100 మాత్రమే అందుబాటులో ఉండగా రూ.50 నుంచి 100 అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

నాన్ జ్యూడీషియల్ స్టాంపుల ఇండెంట్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, స్టాంపు వెండర్లు కృత్రిమ కొరత సృష్టించి ప్రజలు స్థిరాస్తి వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తే సహించం. అధిక మొత్తం వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఈ-స్టాంపింగ్ ఏజెన్సీ పరిధిలో క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు చేపడతాం. - డీఐజీ పీజీఎస్ కళ్యాణి

పలువురు అదనపు జిల్లా న్యాయాధికారుల బదిలీ

కర్నూలు లీగల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు అదనపు జిల్లా న్యాయాధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. కర్నూలు మొదటి అదనపు జిల్లా న్యాయాధికారిగా పని చేస్తున్న జి. భూపాల్ రెడ్డిని విజయవాడ ఏసీబీ కోర్టుకు బదిలీ చేసి ఆయన స్థానంలో కాకినాడలో పని చేస్తున్న పి.కమలాదేవిని నియమించారు. కర్నూలు 6వ అదనపు జిల్లా న్యాయాధికారిగా పని చేస్తున్న పి. పాండురంగారెడ్డిని క్రిష్ణా జిల్లా మచిలీపట్నంకు బదిలీ చేసి ఆయన స్థానంలో నంద్యాలలో పని చేస్తున్న మూడో అదనపు జిల్లా న్యాయాధికారి పి. వాసును నియమించారు. ఒంగోలులో పని చేస్తున్న డి. అమ్మనరాజును నంద్యాల మూడో అదనపు జిల్లా న్యాయాధికారిగా బదిలీ చేశారు. అనంతపురంలో పని చేస్తున్న ఎం. శోభారాణిని ఖాళీగా ఉన్న కర్నూలు సీబీఐ కోర్టు న్యాయాధికారిగా బదిలీ చేశారు. అనకాపల్లిలో పని చేస్తున్న ఎన్. శ్రీవిద్యను ఖాళీగా ఉన్న కర్నూలు ఏసీబీ కోర్టు న్యాయాధికారిగా నియమించారు. ఆళ్లగడ్డలో పని చేస్తున్న ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణను ఏలూరుకు బదిలీ చేసి కర్నూలు ఫ్యామిలీ కోర్టు జడ్జికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పాలని ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 54 మంది అదనపు జిల్లా జడ్జీలను బదిలీ చేసి ఈ నెల 21వ తేదీలోపు ఆయా న్యాయాధికారులు తమ నూతన పదవీ బాధ్యతలు స్వీకరించాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది.

దరఖాస్తులను శ్రద్ధగా పరిష్కరించాలి



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. రీ ఓపెన్ కేసులు 104 ఉన్నాయని, వీటి పరిష్కారానికై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పదే పదే అర్జీదారులు సమస్యల పరిష్కారానికి తిరగకుండా నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. సీఎంవో గ్రీవెన్స్‌లను ఆయా శాఖల జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకుని పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పరిష్కారం అయిన అర్జీలను సక్రమంగా పరిష్కరించారా? లేదా అని ఆయా శాఖల జిల్లా అధికారులు ఆడిట్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో పెరిగిన ఉష్ణోగ్రతలు



నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. వారం రోజుల నుంచి 36 డిగ్రీల సెల్సియస్ నుంచి 38 డిగ్రీల వరకు నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. కానీ సోమవారం ఒక్కసారిగా కర్నూలు, నంద్యాల జిల్లాలు వేడెక్కాయి. కర్నూలు జిల్లా పెద్దకడుబూరు మండలంలో 40.70 డిగ్రీలు, కోడుమూరు మండలంలో 40.70డిగ్రీలు, హొళగుందలో 40.61, ఆదోనిలో 40.40, కర్నూలు నగరంలో 40.28 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదైంది. నంద్యాల జిల్లా పాణ్యం మండలంలో 40.59 డిగ్రీలు, రుద్రవరంలో 40.55, డోన్‌లో 40.47, ఆళ్లగడ్డలో 40.31, జూపాడుబంగ్లాలో 40.03 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ మండలాల్లో గాలిలో తేమశాతం తగ్గడంతో వడగాలులు వీచినట్లు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. రాబోయే మూడురోజుల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని, అదే సమయంలో పగటి ఉష్ణోగ్రతలు కూడా పెరిగే అవకాశముందని హెచ్చరించారు.

ప్రజా సమస్యల్లో న్యాయం చేస్తాం

- పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 120 ఫిర్యాదులు
- ఎస్పీ విక్రాంత్ పాటిల్



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

కర్నూలు క్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల్లో న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 120 ఫిర్యాదులు వచ్చాయి. వీటన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులు న్యాయం చేసి సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా, సీఐలు శ్రీనివాస నాయక్, ఇబ్రహీం పాల్గొన్నారు.



9 మంది సీఐల బదిలీ

కర్నూలు క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, అనంతపురం రేంజ్ పరిధిలో 9 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.దస్తగిరిబాబు	డీటీసీ, అన్నమయ్య	సిరివెళ్ల సర్కిల్, నంద్యాల
ఎస్.వంశీధర్	సిరివెల్ల సర్కిల్	వీఆర్, నంద్యాల
వి.ప్రభాకర్ రెడ్డి	ఎస్సీ ఎస్టీ సెల్ అన్నమయ్య జిల్లా	ఫ్యాక్షన్ జోన్, నంద్యాల
ఎం.పార్థసారధి	ఫ్యాక్షన్ జోన్, నంద్యాల	డీటీసీ కర్నూలు
పి.గౌతమి	డీటీసీ కర్నూలు	ఉమెన్ పీఎస్-1, నంద్యాల
జె.రమేష్ కుమార్	ఉమెన్ పీఎస్-1, నంద్యాల	వీఆర్, నంద్యాల
యు.లక్ష్మయ్య	వీఆర్, కర్నూలు	సీసీఎస్-3, నంద్యాల
ఎన్.క్రిష్ణయ్య	సీసీఎస్-3 నంద్యాల	డీసీఆర్‌బీ, నంద్యాల
ఏ.ఆదినారాయణ రెడ్డి	డీసీఆర్‌బీ, నంద్యాల	డీటీసీ, అన్నమయ్య

ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ
- కర్నూలులో వరల్డ్ హెల్త్ డే ర్యాలీ

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ పిలుపునిచ్చారు. ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకునే ఆహారం, తాగేనీరు, పీల్చేగాలి, పర్యావరణం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎంహెచ్‌ఓ ప్రారంభించారు. అనంతరం నగరంలోని బుధవారపేట మెరిడీయన్ ఫంక్షన్ హాలులో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ శాంతికళ మాట్లాడుతూ కిషోర బాల బాలికల ఆరోగ్య సేవలు, నవజాత ఆరోగ్య సేవలు వ్యాధి నిరోధక టీకాలను ప్రజలకు అందించాలన్నారు. చిన్న పిల్లల ఆరోగ్యాన్ని కాపాడితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. మానసిక ఒత్తిడి, పని భారం, సమయానికి ఆహారం తీసుకోకపోవడం వల్లే ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో

ప్రగతి పనులను వేగవంతం చేయండి

పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో ప్రగతి పనులు వేగవంతం చేయాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రభుత్వ అతిథి గృహంలో కమిషనర్ రవీంద్రబాబు, అన్ని విభాగాల అధికారులతో నగర అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు సంబంధించి రహదారుల నిర్మాణ పనుల్లో జాప్యం వద్దన్నారు. రాజ్‌విహార్ సమీపంలో హంద్రీ నది ఒడ్డున బండ్‌రోడ్డు, మెడికల్ కాలేజీ వద్ద మలుపు విస్తరణ, రెండో పోలీసు పటాలంలో బైపాస్ రహదారి నిర్మాణం పనులు వేగవంతం చేయాలన్నారు. పాతబస్టాండు, ప్రభుత్వ ఆసుపత్రి, వినాయక ఘాట్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కి ఇబ్బంది ఉందన్నారు. రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన తోపుడు బండ్లను తొలగించాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వర రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్ఓ జునైద్, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, ఎంఈలు శేషసాయి, సత్యనారాయణ పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

రామకోటి

● పూర్తి చేసిన నాగలదిన్నె వాసి
●ఆంజనేయస్వామి ఆలయంలో సమర్పణ


రామకోటి పుస్తకాలతో బోయ చెన్నయ్య, మల్లేశ్వరి దంపతులు

రుద్రవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండలం నాగలదిన్నె గ్రామానికి చెందిన బోయ చెన్నయ్య దంపతులు రామకోటి పూర్తి చేశారు. బోయ చెన్నయ్య 40 ఏళ్ల క్రితం బెంగుళూరుకు ఉద్యోగ రీత్యా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో పనిచేస్తూ పదవీ విరమణ పొంది అక్కడే ఉంటున్నారు. జన్మించిన ఆయన రామ నామం కోటిసార్లు రాసి స్వగ్రామంపై మక్కువతో నాగులదిన్నెలోని ఆంజనేయస్వామి దేవాలయంలో సమర్పించారు. 2017 నవంబరు 3వ తేదీన ఆయన రామకోటిని ప్రారంభించి ఈనెల మూడో తేదీన పూర్తి చేశారు. రామకోటిని పూర్తి చేసేందుకు 8 సంవత్సరాల ఒక నెల 3 రోజుల పాటు ఆయన సమయం తీసుకున్నారు. సొంతూరు కన్నతల్లితో సమానమని, అందుకే రామకోటిని పూర్తి చేసి ఇక్కడ అప్పగించినట్లు తెలిపారు. రామకోటి పూర్తి చేయడం తన భార్య బోయ మల్లేశ్వరి సహకారం జీవితంలో మర్చిపోలేనని చెన్నయ్య పేర్కొన్నారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎం. బాలునాయక్


బిగ్ బాస్కెట్ కార్మికులతో పేర్లు నమోదు చేయిస్తున్న జాయింట్ కమిషనర్ బాలునాయక్

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సంఘటిత, అసంఘటిత కార్మికులందరూ ఈశ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని రాయలసీమ జోన్ కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎం. బాలునాయక్ అన్నారు. సోమవారం వెంటకమరణ కాలనీలో ప్రత్యేక నమోదు సెంటరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాట్ ఫాం అండ్ గిగ్ కార్మికులు అమెజాన్, ఈ-కార్టు, డెలివరీ కం సర్వీస్ డెలివరీ బాయ్స్, స్విగ్గి, జోమాటో డెలివరీ బాయ్స్, ఓల, రాపిడో కార్మికులు, మీశో, బ్లూ డార్ట్, మిత్ర, అజియా, టాటా క్లిక్, ఇండియా మార్ట్, ఇ-బై డెలివరీ కార్మికులందరూ పేర్లను ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అసంఘటిత కార్మికులందరూ ఈశ్రమ్ వెబ్‌సైట్/కామన్ సర్వీస్‌సెంటర్, గ్రామ, వార్డు సచివాలయాలు, సమీప కార్మిక శాఖ కార్యాలయాల్లో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈ నెల 17 వరకు పేర్ల నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకోవాలంటే అసంఘటిత కార్మికుడై ఉండాలని, 16 నుంచి 59 సంవత్సరాల వయసు ఉండి, ఆదాయపు పన్ను చెల్లించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక శాఖ అధికారులు కేశన్న, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల వేటగాళ్ల అరెస్టు

కోర్టులో హాజరు


వన్యప్రాణి వేటగాళ్లతో ఫారెస్టు అధికారులు

రుద్రవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం ఫారెస్టు రేంజ్ పరిధిలోని లోతు వంక సమీపంలో వన్యప్రాణుల వేటగాళ్లను అరెస్టు చేసినట్లు సోమవారం రేంజర్ శ్రీపతినాయుడు తెలిపారు. రుద్రవరం గ్రామానికి చెందిన కె. సాంబశివరావు, కె. చిన్నమల్లేశ్ అనే వేటగాళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి వన్యప్రాణి మాంసం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆళ్లగడ్డ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు వన్యప్రాణి వేటగాళ్లను హాజరుపరిచినట్లు తెలిపారు. వేటగాళ్లకు మేజిస్ట్రేట్ బెయిలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఆఫీసరు ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసరు రామక్రిష్ణ, బీట్ ఆఫీసరు సురేంద్రగౌడ్ పాల్గొన్నారు.

నకిలీ నోట్ల ముఠా అరెస్ట్..?

నంద్యాల క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నకిలీ నోట్ల ముఠాను పోలీసులు అరెస్ట్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఒక లక్ష రూపాయల ఒరిజినల్ నోట్లు ఇస్తే రూ.3లక్షల నకిలీ నోట్లు ఇస్తామని మోసం చేసే ప్రకాశం జిల్లా గ్యాంగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రకాశం జిల్లాలోని దర్శికి చెందిన ముగ్గురు, త్రిపురాంతకానికి చెందిన మరొకరు, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మరో వ్యక్తి, నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన వ్యక్తి ఒక ముఠాగా ఏర్పడి కొంతకాలంగా నకిలీనోట్ల దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఒరిజినల్ నోట్లు తీసుకున్న అనంతరం నోట్ల కట్టల్లో పైన, కిందిభాగంలో నాలుగు, అయిదు ఒరిజినల్ నోట్లు పెట్టి మధ్యలో తెల్లకాగితాలను పెట్టి మోసం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే వీరు ఇచ్చిన ఆఫర్‌కు నంద్యాల తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని నందమూరినగర్‌కు చెందిన ఒక వ్యక్తి ఆశపడి వారి వలలో పడినట్లు తెలిసింది. ఒరిజినల్ నోట్లు ఇచ్చి నకిలీ నోట్లు తీసుకొని పోవాలని అయ్యలూరు మెట్టవద్దకు రమ్మని సదరు నకిలీ నోట్ల ముఠా చెప్పడంతో అనుమానం వచ్చి నంద్యాల ఏఎస్పీ జావలి ఆల్ఫోన్స్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారినుంచి రూ.2లక్షల నకిలీ నోట్లను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇంతజరుగుతున్నా పోలీస్ ఉన్నతాధికారులు, నంద్యాల తాలుకా సిబ్బంది మీడియాకు చెప్పకపోవడం గమనార్హం.

నిధులు లేవు.. నీళ్లు రావు!


దేవనకొండ మండలం కరిడికొండ వద్ద అసంపూర్తిగా పిల్ల కాలువలు

(5వ పేజీ తరువాయి)

సీఎం హామీ అమలు ఏదీ..?

పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలో గత ఏడది అక్టోబరు 1న సీఎం చంద్రబాబు పర్యటించారు. కూటమి ప్రభుత్వం కొలుదీరాక తొలిసారిగా జిల్లాకు వచ్చారు. హంద్రీనీవా కాలువ నుంచి ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి సాగునీరు ఇస్తారని ప్రజావేదికలో స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇరిగేషన్ ఇంజనీర్లు రూ.6.50 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఆరు నెలలైనా సీఎం హామీ అమలు దిశగా అడుగులు పడడం లేదు. ఇన్‌చార్జి మంత్రి నిమ్మల దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలి.

కరువు తీరాలి.. వలసలు ఆగాలి

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో కరువు, వలసలు నివారణ లక్ష్యంగా 40 వేల ఎకరాలకు సాగునీరు, 1.20 లక్షల జనాభాకు తాగునీరు అందించాలని ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి రూ.1,985.42 కోట్లతో శ్రీకారం చుట్టారు. ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 1.50 లక్షల జనాభాకు సాగునీటి అందించాలని వేదవతి ఎత్తిపోతల పథకం రూ.1,94.80 కోట్లతో చేపట్టి పనులకు మొదలు పెట్టారు. కర్నూలు, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కేసీ కాలువకు 31.90 టీఎంసీలు నీటివాటా ఉన్నా.. నిల్వ చేసుకునే జలాశయం లేదు. సుంకేసుల బ్యారేజీ ఎగువన 20 టీఎంసీల సామర్థ్యంలో గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి రూ.2,980 కోట్లు మంజూరు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం రావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నా.. ఆ దిశగా కదలిక లేదు. పది నెలలు గడిచినా పనులు మొదలు కాకపోవడంతో కరువు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీరు.. రోడ్లపై దృష్టి సారించాలి

జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించేందుకు నేడు కలెక్టర్ పి. రంజిత్‌బాషా అధ్యక్షతన జరుగనుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లాకు చెందిన మంత్రి టీజీ భరత్ సహా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరవుతున్నారు. జిల్లానే వేధిస్తున్న తాగునీరు, రోడ్ల సమస్యలపై చర్చించాలని పలువురు కోరుతున్నారు. వాటర్‌గ్రిడ్ కింద రూ.5,500 కోట్లకు ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వాన్ని ఒప్పించి నిధులు మంజూరు చేయించాలి. అలాగే.. పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం, ఏపీ టిడ్కో ఇళ్ల పంపిణీపై కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది



నేడు మంత్రి నిమ్మల పర్యటన ఇలా..

సోమవారం విజయవాడ నుంచి రైలులో బయలుదేరిన మంత్రి నిమ్మల మంగళవారం ఉదయం 5.20 గంటలకు గుంతకల్లు రైల్వే గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి 8 గంటలకు బయలుదేరి పత్తికొండ సమీపంలోని హంద్రీ నీవా కాలువ వద్దకు 8.45 గంటలకు చేరుకుంటారు. విస్తరణ పనులు పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు కర్నూలు నగరం ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకుంటారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలతో సమావేశం అవుతారు. సాయంత్రం 3 గంటలకు డీడీఆర్ సమావేశానికి హాజరు అవుతారు. రాత్రి 8.30 గంటలకు డోన్‌కు చేరుకొని రైలులో విజయవాడకు బయలుదేరుతారు.

పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు..!



హత్యాయత్నం జరిగిన సీతారామాంజనేయ దేవస్థానం

● గోవిందపల్లె ఘటనలో విచారణను వేగవంతం చేసిన పోలీసులు
● మరో నిందితుడి కోసం గాలింపు ముమ్మరం

శిరివెళ్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామానికి చెందిన వైసీపీ మండల కన్వీనర్ ఇందూరి ప్రతాప్‌రెడ్డిపై సీతారామాంజనేయ దేవస్థానంలో ఇటీవల జరిగిన హత్యాయత్నం ఘటనలో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ప్రత్యక్ష సాక్షి వెంకట కృష్టారెడ్డి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న గ్రామానికి చెందిన గంగ దాసరి రవిచంద్రారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. రవిచంద్రారెడ్డి వెంట వచ్చి హత్యాయత్నానికి సహకరించినట్లుగా భావిస్తున్న మరో నిందితుడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. నిందితుడి ఆచూకీ కోసం ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లోని పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం కోర్టులో హాజరుపరిచేందుకు పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ప్రజా పరిష్కార వేదికలో అధికారుల మధ్య వాగ్వాదం

బండిఆత్మకూరు, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగే పరిష్కార వేదికలో ఇరువురు అధికారుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సోమవారం ఉదయం బండి ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో మండల స్థాయి అధికారులంతా పాల్గొన్నారు. ఈ సమయంలో గత నెలలో మండలంలోని పరమటూరు గ్రామంలో సురేష్ అనే వ్యక్తికి చెందిన కంది పంట గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఈ కేసుపై వ్యవసాయ శాఖ రిపోర్టు ఇవ్వాలని ఎస్‌ఐ జగన్మోహన్ పోలీస్‌ను పంపగా సంతకం చేకుండా, పేపర్ చింపి తిప్పి పంపిందని, పరిష్కార వేదికలో ఉన్న ఏవో స్వాతి వద్దకు ఎస్‌ఐ వచ్చి రిపోర్టు ఇవ్వాలని వాదించారు. ఈ క్రమంలో తనను నువ్వు అనే ఏక వచనంతో ఎలా మాట్లాడతారని, మహిళలను ఉద్దేశించి అట్లా ఎలా మాట్లాడతారని వాదించారు. తనకు గత నెల 13వ తేది వేసి రిపోర్టు ఇవ్వమని ఇప్పుడు లెటర్ పెట్ట డం ఏంటని ఆమె అన్నారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వాలని ఇ స్తే ఇవ్వండి, లేకపోతే మీ ఇష్టం అని ఎస్‌ఐ తిరిగి వెళ్ళిపోయారు. ఆ తరువాత సహచర అధికారుల ఎదుట ఏవో కన్నీరు పెట్టడం గమనార్హం.

మాజీ ఎమ్మెల్యే కాటసాని హౌస్ అరెస్టు

కర్నూలు క్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని సోమవారం సాయంత్రం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. కల్లూరు మండలం కొంగనపాడు గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా జరిగే రథోత్సవానికి కాటసాని హాజరుకావాల్సి ఉంది. అయితే అదే కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరిత కూడా హాజరయ్యారు. గ్రామంలో కొంత మంది వైసీపీ నాయకులు ఎన్నికల ముందు టీడీపీలో చేరారు. ఈ నేపథ్యంలో కాటసాని అక్కడికి వెళ్తే శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని భావించిన పోలీసులు కాటసానిని హౌస్ అరెస్టు చేశారు. నాలుగో పట్టణ సీఐ మధుసూదన్‌గౌడు, రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్‌ఐలు ఆధ్వర్యంలో పోలీసులు ఆయన ఇంటి వద్ద మోహరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

ప్రయాణికులు క్షేమం

మిడుతూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామ సమీపం సమ్మర్ స్టోరేజ్ దగ్గర షార్ట్ సర్క్యూట్ వల్ల కారు పూర్తిగా దగ్ధం అయింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు సురక్షితంగా బయట పడ్డారు. మండలంలోని బైరాపురం గ్రామానికి చెందిన మహబూబ్ బాషా, అమినుల్ల బాషా, మహిమున్‌బీ అను ముగ్గురు సోమవారం ఉదయం 11 గంటల సమయంలో బైరాపురం నుంచి నందికొట్కూరుకు వెళ్లారు. పనులు ముగించుకుని రాత్రి 8 గంటల సమయంలో తిరిగి సొంత గ్రామానికి కారులో వెళుతుండగా సమ్మర్ స్టోరేజ్ దగ్గర కారులో పొగలు రావడం గమనించిన డ్రైవర్ అమినుల్లా బాషా అప్రమత్తమై కారును పక్కకు ఆపాడు. అందులో వున్న ముగ్గురు వ్యక్తులు కిందకు దిగా రు. కొంత సమయానికి కారులో నుంచి మంటలు చెలరేగి కారు పూర్తిగా దహనమైంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

కేసీ కాలువలో పడి వ్యక్తి మృతి

పగిడ్యాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన పఠాన్ దావుత్‌ఖాన్ (50) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కేసీ కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన దావుత్‌ఖాన్ ఆదివారం పని చేసేందుకు వెళ్లారు. పని ముగించుకొని కేసీ కాలువలో బట్టలు శుభ్రం చేసుకునేందుకు దిగాడు. ప్రమాదవశాత్తు కేసీ కాలువలో పడి మృతి చెందాడు. మృతుడు తల్లి కొద్దిరోజుల కిందట మృతి చెందడం, భార్య పుట్టింటికి వెళ్లడంతో ఒక్కడే ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడు పఠాన్ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తల్లి మందలించిందని కుమార్తె ఆత్మహత్య

ఆదోని, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రాంతి నగర్‌కు చెందిన యువతి తల్లి మందలించడంతో సోమవారం ఆత్మహత్య చేసుకుంది. పట్టణంలోని క్రాంతినగర్ చెందిన ఉరుకుందప్ప కుమార్తె ఇందు(20) సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తుండేది. ఇది గమనించిన తల్లి గట్టిగా మందలించింది. దీంతో మనస్తాపం చెందిన ఇందు గదిలోకి వెళ్లి నిప్పంటించుకుంది. మంటలు, పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసుకున్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపారు.

కౌతాళం అడవుల్లో కర్ణాటక వేటగాళ్లు

● తూటాల దెబ్బకు నేలకొరిగిన కృష్ణ జింకలు
● పోలీసుల అదుపులో వేటగాడు
● నాటు తుపాకీ, జింక మాంసం స్వాధీనం


ల్యాబ్‌కు పంపడానికి బాక్సుల్లో సిద్ధం చేసిన జింక మాంసం

ఆదోని రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కౌతాళం అడవుల్లో కర్ణాటక వన్య ప్రాణుల వేటగాళ్లు హల్‌చల్ చేశారు. పట్టపగలు కౌతాళం పంట పొలాల్లో జింకల మందపై వేటగాళ్లు తుపాకులతో దాడి చేసి కృష్ణ జంకలను చంపేశారు. రైతులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు మెరుపుదాడి చేసి కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్ళారి హళేహూరుకు చెందిన వన్యప్రాణుల వేటగాడు తిమ్మన్నను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఓ నాటు తుపాకీని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు వేటగాళ్లు తప్పించుకున్నారు. ఆదివారం ముగ్గురు వేటగాళ్లు ద్విచక్ర వాహనంపై కౌతాళం మండలం కాత్రికి సమీప పంట పొలాల్లో మాటు వేశారు. అదును చూసి గుంపుగా వెళ్తున్న జింకల మందపై ఒక్కసారిగా నాటు తుపాకీతో గురిపెట్టి కాల్చారు. ఈ కాల్పుల్లో పది జింకలు నేలకొరిగాయి. తుపాకీ మోతలు విన్న రైతులు భయపడి వెళ్ళి చూడగా, అక్కడ ముగ్గురు వ్యక్తులు జింకలను కోయడం చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. అంతలోపు వేటగాళ్లు జింక మాంసాన్ని సంచిలో వేసుకొని నాటు తుపాకీని పైకెత్తి కేకలు వేస్తూ వెళ్లి పోతుండగా, వీరికి పోలీసులు తారసపడ్డారు. ఇద్దరు వేటగాళ్లు పారిపోగా, తిమ్మన్న మాత్రమే నాటు తుపాకీ, జింక మాంసంతో పట్టుబడ్డాడు. ఆ తుపాకీ బ్రిటీష్ కాలంలోనిదని పోలీసులు అంటున్నారు. నిందితుడు తిమ్మన్నను పోలీసులు స్టేషన్‌కు తరలించి నాటు తుపాకీని భద్రపరిచి కుప్పగల్లు ఫారెస్టు ప్లాట్ వాచ్‌మెన్‌కు ఆదివారం సాయంత్రం 5గంటల సమయంలో సమాచారం అందజేశారు. ఆదోని ఫారెస్టు అధికారి తేజస్విని తన సిబ్బందితో కలిసి రాత్రి 8.30 గంటల సమయంలో కౌతాళం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని వేటగాడు తిమ్మన్నను, నాటు తుపాకీని, జింక మాంసాన్ని, ద్విచక్ర వాహనాన్ని ఆదోనికి తరలించారు. కాగా వేటగాడిపై కేసు పెట్టొద్దని... ఫార్మాలిటీస్ ఉంటే చూసుకుంటామని ఫారెస్టు అధికారులపై ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి అనుచరుడు ఒత్తిడి తెచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నాం

కౌతాళం మండలం కాత్రికి పంట పొలాల్లో జింకలపై తుపాకీతో కాల్పులు జరిపి వాటి మరణానికి కారణమైన కర్ణాటకకు చెందిన తిమ్మన్నను అదుపులో తీసుకున్నాం. అతని నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నాం. నిందితుడ్ని కోర్టుకు హాజరు పరుస్తాం. జింక మాంసాన్ని ల్యాబ్‌కు పంపిస్తున్నాం.

- తేజశ్విని, ఆదోని ఫారెస్టు అధికారి

బొమ్మిరెడ్డిపల్లిలో ఉద్రిక్తత

● గ్రామానికి చేరుకున్న హత్య కేసు నిందితులు
● హైకోర్టు ఆదేశాలతో బందోబస్తు


పోలీసు బందోబస్తుతో నిందితుల వాహనాలు

వెల్దుర్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన హత్య కేసు నిందితులు పోలీసు బందోబస్తు మధ్య సోమవారం ఇళ్లకు చేరుకున్నారు. గత ఏడాది జూన్‌లో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గిరినాథ్ చౌదరి హత్యకు గురయ్యారు. ఈ కేసులో 16 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పట్లో వీరితో పాటు మరో 16 కుటుంబాల వారు గ్రామం వదిలి వెళ్లిపోయారు.

అయితే హత్య కేసు నిందితులు తమకు పొలాలు ఉన్నాయని పంటలు సాగుచేసుకునేందుకు, పుట్టిన ఊరిలో బతికేందుకు రక్షణ కల్పించాలని 32 మంది గ్రామస్థులు హైకోర్టును ఆశ్రయించారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని, రక్షణ కల్పించాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. పత్తికొండ డీఎస్పీ వెంకట రామయ్య, కర్నూలు డీఎస్పీ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో 50 మంది ప్రత్యేక బలగాల సమక్షంలో నిందితులను గ్రామానికి తీసుకెళ్లారు. అయితే టీడీపీ నాయకుల ఇంటి సమీపంలో ఇళ్లు ఉండేవారితో ఘర్షణలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని, ఐదు కుటుంబాలను వెనక్కు పంపారు. గ్రామంలో సుమారు 15 మంది పోలీసులతో పికెట్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వెల్దుర్తి సీఐ మధుసూదనరావు, కర్నూ లు సీఐ రామానాయుడు, పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, వెల్దుర్తి ఎస్‌ఐ అశోక్, క్రిష్ణగిరి ఎస్‌ఐ మల్లిఖార్జున పాల్గొన్నారు.


నిందితులతో మాట్లాడుతున్న పోలీసులు

కారు ధ్వంసం: కాగా హత్య నిందితులు గ్రామంలోకి రావడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైసీపీ నాయకుడు చక్రపాణిరెడ్డి ఇంటి వద్ద కారును గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పోలీసుల పికెట్ ఉన్నా ఇలా జరగడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

దేవనకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తాళలేక బేతపల్లికి చెందిన రాజు(42) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన సుంకన్న, లక్ష్మీదేవి దంపతుల పెద్ద కుమా రుడు రాజు తనకున్న రెండెకరాల పొలంలో గత రెండేళ్లుగా బోర్లు వేసి, మిరప, వేరుశెనగ పంటలు సాగు చేశాడు. పంటలు పండకపోవడంతో అప్పుల భారం పెరిగిపోయింది. కుటుంబంతో కలసి గుంటూరుకు వలస వెళ్లాడు. గత మూడు రోజుల కిందట గ్రామానికి పని నిమిత్తం వచ్చి, ఆదివారం పురుగుల మందు తాగాడు. కర్నూలు ఆస్పత్రిలో కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య రామాంజినమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కర్నూలులో స్కిన్ బ్యాంక్ ఏర్పాటు

● రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం
● మంత్రి టీజీ భరత్

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొట్టమొదటి స్కిన్ బ్యాంకు సెంటర్‌ను కర్నూలు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో తీసుకువస్తున్నట్లు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. సోమవారం నగరంలోని రెడ్ క్రాస్ సొసైటీ ఆవరణలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో దివ్యాంగులకు వీల్ చైర్లను మంత్రితో పాటు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ పి.రంజిత్ బాషా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్కిన్ బ్యాంకులు దేశంలో 12 మాత్రమే ఉన్నాయని, 13వ స్కిన్ బ్యాంక్ సెంటర్‌ను కర్నూలులో ఏర్పాటు చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీని అభినం దించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ 2004లో స్థాపించబడిందని, ఇప్పటికే ఐబ్యాంకు సంబంధించి కళ్లను సేకరించడంలో దేశంలోనే కర్నూలు రెండో స్థానంలో ఉందన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కేజీ గోవిందరెడ్డి మాట్లాడారు. గత 22 ఏళ్లుగా శివరాత్రి, ఉగాది పండుగలకు శ్రీశైలానికి వచ్చే భక్తులకు సేవలు అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులను ఎన్‌జీవోలను మంత్రి, ఎంపీ, కలెక్టర్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యులు కే.అరుణ, డా.కేవీ సుబ్బారెడ్డి, డా.విజయకుమార్ రెడ్డి, మధుసూదన్, శంకర్ రెడ్డి, వైస్ చైర్మన్ మహేంద్ర కుమార్ పాల్గొన్నారు.


దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేస్తున్న మంత్రి, ఎంపీ, కలెక్టర్

సమస్యలను పరిష్కరించండి

అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే సమస్యలను పరిష్కరించాలని కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అధికారులకు సూచించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వేదికకు 9 అర్జీలు వచ్చాయి. మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, సూపరింటెండెంట్లు క్రిస్టోఫర్, స్వర్ణలత, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, పెంచలయ్య పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలి: కేసీ కెనాల్‌లో కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలాని ఎస్‌యూసీఐ (సీ) పార్టీ ఇన్‌చార్జి వి.హరీష్‌కుమార్‌రెడ్డి కోరారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రవహిస్తున్న కేసీ కాలువ ఇటీవల తీవ్రమైన కాలుష్యానికి గురవు తుందన్నారు. కాలువలో వాటర్ హైసింత్ మొక్కలు పెరిగి ప్రవా హాన్ని అడ్డుకోవడంతో పాటు పక్కనున్న నివాసాలు, విద్యా సంస్థలు, వ్యాపార ప్రదేశాలు కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. నగర కార్యదర్శి ఎం.తేజోవతి, సభ్యులు నాగన్న, మల్లేష్ పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్

ఓర్వకల్లు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం ఓర్వకల్లు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు అర్జీలను స్వీకరించారు. అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

గూడూరు ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్లు సోమవారం నుంచి ప్రారంభమైనట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ రమణ తెలిపారు. సోమవారం గూడూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో తెలుగు, ఇంగ్లీష్, మీడియం గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. అడ్మిషన్ కావల్సిన వారు వెంటనే కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. విద్యార్థుల కు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ రికార్డ్స్ ఇస్తామని తెలిపారు.

రేపు బండలాగుడు పోటీలు

గూడూరు ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు గ్రామంలో వెలసిన అప్పాల రెడ్డి తాత తిరునాళ్లను పురస్కరించుకుని బుధవారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల సీనియర్ టీడీపీ నాయకుడు కె.మహేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం గుడి పాడు గ్రామంలో బండలాగుడు పోటీల కోసం స్థలం, ఇతర ఏర్పాట్లను టీడీపీ నాయకుడు కె.మహేశ్వర రెడ్డి పరిశీలిం చారు. కార్యక్రమానికి జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, కోడు మూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరై పోటీలను ప్రారం భిస్తారని ఆయన తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.40వేలు దాత జిల్లా సీనియర్ టీడీపీ నాయకుడు డి.విష్ణువర్ధన్ రెడ్డి, రెండో విజేతకు రూ.30వేలు దాత కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, మూడో విజేతలకు రూ.20వేలు దాత ఆది కేశవ రెడ్డి, నాలుగో విజేతకు రూ. 10 వేలు దాత తెలుగు సంఘం, ఐదో విజేతకు రూ.5వేలు దాత కరెంటు పెద్దయ్య బహుమతులను అందజేస్తారని మహేశ్వర రెడ్డి తెలిపారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త పింజరి పెద్దయ్య (57) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు పెద్దయ్య పొలానికి వెళ్లాడు. సాయంత్రం ఛాతిలో నొప్పి రావడంతో చెట్టు కింద పడిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోడుమూరు తరలించారు. అయితే మార్గమధ్యంలో పెద్దయ్య మృతి చెందాడు.

డీబీసీ డబ్ల్యూవోగా ప్రసూన బాధ్యతలు స్వీకరణ

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వెనుకబడిన సంక్షేమ సాధికారిత అధికారిగా కె.ప్రసూన సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కలెక్టర్ పి.రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం స్థానిక బిర్లా కాంపౌండు సమీపంలో ఉన్న జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయానికి వచ్చి ఆమె ఉద్యోగ బాధ్యతలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు ఏబీసీడబ్ల్యూవోలు, వార్డెన్లు ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

సి.బెళగల్ ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ సుమంత్ ఇంజనీరింగ్ అసిస్టెంటు, వర్క్ ఇన్స్‌పెక్టర్లను ఆదేశించారు. సోమవారం మండలంలోని బురాన్‌దొడ్డి, కబందహల్ గ్రామాల్లోని గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు.

వైభవంగా సీతారాముల రథోత్సవం

కల్లూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా కల్లూరు మండలం కొంగనపాడు, పుసులూరు గ్రామాల్లో సీతారాముల రథోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత హాజర య్యారు. స్వామి అమ్మవార్లకు ఆమె పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. సాయంత్రం వేలాది మంది భక్తుల సమక్షంలో రథోత్సవం సాగింది. కార్యక్రమంలో ఏపీ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, టీడీపీ నాయకులు వాకిటి మాదేశ్, ఈవీ.రమణ, కొంగనపాడు వినోద్‌కుమార్, మాజీ సర్పంచు నాగయ్య, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, కృష్ణ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత


సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు, పురోహితులు

బైరెడ్డినగర్‌లో సీతారాముల కల్యాణం

ఓర్వకల్లు: ఓర్వకల్లు మండలం హుశేనాపురం గ్రామ సమీపంలోని బైరెడ్డినగర్‌లో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.. స్వామివారికి మాజీ సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, ఆయన సతీమణి శివ తులసమ్మ పట్టువస్త్రాలు సమర్పించారు. కళ్యాణాన్ని పురోహితులు జంధ్యాల మనోహర్ శర్మ జరిపించారు. కార్యక్రమంలో భక్తులు శివకుమార్, పద్మావతి, అశోక్ కుమార్, మహేశ్వరి, చిన్న తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సవారమ్మ ప్రభోత్సవం

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమడగుంట్ల గ్రామంలో సోమవారం సాయంత్రం సవారమ్మదేవి ప్రభోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ఉదయం విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రభాకరరెడ్డి ఇంటి నుంచి కుంభం తీసుకొచ్చారు. అనంతరం ప్రభపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చారు. నైవేద్యం సమర్పించి టెంకా యలు కొట్టి పూజలు చేశారు. అనంతరం వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి సవారమ్మదేవి ఆలయం వరకు ప్రభను లాగారు. వేడుకలో గ్రామప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.


ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

● **బండలాగుడు పోటీలు:** శ్రీరామనవమి, సవారమ్మదేవి వేడుకల సందర్భంగా అమడగుంట్లలో సోమవారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను టీడీపీ నాయకుడు పడిగ సురేష్ ప్రారంభించారు. ఈ పోటీలో పెద్దరంగస్వామి ఎద్దులు 3618 అడుగులతో మొదటి స్థానంలో నిలిచాయి. విజేతకు టీడీపీ నాయకులు పడిగ రమేష్, పడిగ సురేష్ రూ. 12వేలు బహుమతిగా అందిం చారు. తర్వాత స్థానాల్లో ఇలియాస్‌బాషా, బాలమద్దిలేటి ఎద్దులు నిలిచాయి. వీరికి గోవిందు కుమారులు రూ.6వేలు, గొల్ల రాజు రూ. 3,500 అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తులసిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శంకరరెడ్డి, మధునాయుడు, రవికిషోర్ పాల్గొన్నారు.

వైభవంగా అప్పాల రెడ్డి తాత తిరునాళ్లు

గూడూరు ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం గుడిపాడు గ్రామంలో వెలసిన అప్పాలరెడ్డి తాత తిరునాళ్లు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. సాయంత్రం స్వామి వారి ప్రభోత్సవం నిర్వహించారు. మంగళవారం స్వామి వారి రథోత్సవం నిర్వ హించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

బ్లాస్టింగ్‌ను నిలిపేయాలి

కల్లూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం ఉలింద కొండ కంకర ఫ్యాక్టరీల్లో బోర్ బ్లాస్టింగ్‌ను నిలిపేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమ వారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో కలెక్టర్‌కు సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఉలింద కొండ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఏడు కంకర ఫ్యాక్టరీల్లో బోర్ బ్లాస్టింగ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. బ్లాస్టింగ్ ధాటికి గ్రామంలోని నివాసాలు నెర్రెలిచ్చి కూలి పోతున్నాయని కలెక్టర్ రంజిత్‌బాషాకు వివరించారు. ప్రభుత్వ అనుమతులు లేకపోయినా కంకర ఫ్యాక్టరీల యాజమాన్యాలు విచ్చలవిడిగా చెలరేగిపో తున్నాయని వివరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ కృష్ణ, మధు, ప్రజలు పాల్గొన్నారు.

గీతాంజలి నర్సింగ్ కాలేజీలో హెల్త్ డే



మాట్లాడుతున్న పెరుగు విజయవర్ధన్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వరల్డ్ హెల్త్ డేను పురస్కరించుకుని గీతాంజలి గ్రూప్ ఆఫ్ నర్సింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ నగర శివారులోని కిమ్స్ నర్సింగ్ కళాశాల, గీతాంజలి నర్సింగ్ కళా శాల ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. సోమవారం కిమ్స్ నర్సింగ్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అపోలో హాస్పిటల్ (హైదరాబాదు) రేడియాలజిస్టు డా.కేవీ విజయ్ జనరల్ సర్జన్ వాసవి అప్లెక్స్ వైద్యురాలు మల్లేశ్వరి, కళాశాలల చైర్మన్ పెరుగు విజయవర్ధన్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించి వారు మార్కులు వేశారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాలల ప్రిన్సి పాల్స్ వసంత కుమారి, అర్చన పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ నవ్య

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య బాధ్యతలు స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో జిల్లా కేంద్ర గ్రంథాలయం సంస్థ కార్యదర్శి కె. ప్రకాశ్‌కి బాధ్యతలు స్వీకరించిన ప్రతులను అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు చైర్మన్‌గా ప్రభుత్వం ఇప్పటి వరకు ఎవరినీ నియమించనందున జిల్లా గ్రంథాలయ సంస్థకు పర్సన్ ఇన్‌చార్జిగా నవ్య కొనసాగుతారు. పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


జాయింట్ కలెక్టర్ నవ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రకాశ్

నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఐన్‌టీయూసీ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి ఆదేశాల మేరకు సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ అధ్యక్షతన జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా బి. బ్రతుకన్న, సిటీ అధ్యక్షుడిగ రెపల్లే ప్రతాప్, హసన్ బాషా, సురేష్, ఆనందం, జేమ్స్ మహేష్, ఆశీర్వాదంలను ఎన్నుకున్నారు. ఈ సంద ర్భంగా జిల్లా అధ్యక్షుడు బతుకన్న మాట్లాడుతూ జిల్లాలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం ఐన్‌టీయూసీ పనిచే స్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, కోడ మూరు ఇన్‌చార్జి అనంతరత్నం మాదిగ, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, ఎస్ ప్రమీలా, లాజరస్, సత్యనా రాయణ గుప్త, సయ్యద్ నవీద్ పాల్గొన్నారు.

బాలింతల వార్డులో దొంగ హల్‌చల్

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనిక్ విభాగంలో ఓ దొంగ హల్‌చల్ చేశారు. ఆదివారం గైనిక్ మొదటి యూనిట్ పోస్టునేటల్ వార్డులో ఓ దొంగ తెల్లషర్టు, తెల్ల పాయింట్, నల్లబూట్లు వేసుకుని వార్డులో చొరబడ్డాడు. గైనిక్ విభాగంలోని వార్డులో గర్భిణులు, బాలింతలు రాత్రి పూట వార్డులకు తలుపులు వేసుకుంటారు. పోస్టునేటల్ యూనిట్- 1కు పక్కనున్న మరో వార్డుకు రెండింటికి ఒకే బాత్‌రూం ఉంది. ఈ నేపథ్యంలో పోస్టునేటల్ వార్డులో ఆపరేషన్ చేయించుకున్న బాలింతలు తలుపులు వేశారు. రాత్రి 11 గంటల సమయంలో లోప లికి ఓ దొంగ వచ్చి బాలింతలను చూశారు. ఓ బాలింత తల్లి ఎవరు సార్ మీరు డాక్టరా..? అని ప్రశ్నించగా.. అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మళ్లీ 12 గంటల సమయంలో పోస్టునేటల్ వార్డుకు దొంగ వచ్చాడు. తలుపు తెరుస్తుంటే ఓ బాలింతల్లి బాత్‌రూమ్ నుంచి చూసి గమనించింది. ఆమె బయటకు రాగానే దొంగ వెళ్లిపోయాడు. ఇక అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో జూపాడుబంగ్లా మండలం తంగడంచ గ్రామానికి చెందిన మాదురి అనే బాలింత తల్లి దొంగ లోపలికి ప్రవేశించడంతో ఆమె ఎందుకు వచ్చా వంటూ నిలదీసింది. దీంతో దొంగ తలు పులు వేసి వెళ్లిపోయాడు. దొంగ బయటకు వెళ్లి రెండు నిమిషాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గర్భిణులు, బాలింతలు ఆందోళన చెందారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోండి

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పండ్లు, ఆకుకూరలు, కూరగాయలను ఆహారంగా తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని గ్యాస్ట్రోఎం టరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ పిలుపునిచ్చారు. నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పేదలకు పండ్లు, ఆకుకూరలు, కూరగాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్‌లో ఏడో తేదీన ప్రపంచ మానవాళికి ఉపయోగపడే విధంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆవిర్భవించిందని వివరించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ జంక్‌ఫుడ్‌ను వదిలేసి, సాత్విక ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కూరగాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధులను అరికడతాయని వివరించారు.

జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో.. కర్నూలు జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో వరల్డ్ హెల్త్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా లీగల్ అథారిటీ సర్వీసెస్ సెక్రటరీ సీనియర్ సివిల్ న్యాయాధికారి లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకుండా రోజూ నడక, యోగా చేయాలని సూచించారు. హాస్పిటల్ సీఈవో డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బీపీ, షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలన్నారు. అడిషనల్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్, హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్ పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధూమపానం, మద్యపానం, జంక్‌ఫుడ్ వంటి వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విజయ శేఖర్, మల్లికార్జున, సోమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.


పేదలకు పండ్లు, కూరగాయలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజలకు ఉపయోగపడే ఆవిష్కరణలు చేపట్టాలి


ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉపయోగపడే ఆవిష్కరణలు చేపట్టాలని ఐఐఐటీ డీఎం ప్రొఫెసర్ ఆర్.సీతారాం ఇంజనీరింగ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక దూపాడు సమీపంలో ఉన్న అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం టెక్నికల్ ఫేస్ట్ ముగింపు కార్యక్రమం జరిగింది. ఇంజనీరింగ్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు, పోస్టర్ ప్రజంటేషన్‌ను ప్రదర్శించారు. ఆటోమేషన్, ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్సి, గ్రీన్ టెక్నాలజీ వంటి ప్రాజెక్టు నమూనాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు పరిశోధనల వైపు ముందుకు వెళ్లాలని అనంతపురం జేఎన్‌టీయూ ప్రొఫెసర్ శ్రీధర్, నంద్యాల ఆర్జీఎం కళాశాల ప్రొఫెసర్ వీ.నరసింహులు, రామేశ్వ రరెడ్డి, డా.ప్రసన్న పిలుపునిచ్చారు. కళాశాల సీఈవో హరీష్ కృష్ణ, ప్రిన్సిపాల్ నవీన్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో ప్రమాదం

విరిగిన చెట్టు, ఆక్సిజన్ పైపులైన్ లీకేజీ

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపర్ స్పెషాలిటీ బ్లాక్ వద్ద ఆదివారం రాత్రి చెట్టు విరిగింది. ఈ ప్రమాదంలో చెట్టు ఆక్సిజన్ పైపులైన్ మీద పడ టంతో ఆక్సిజన్ లీకేజీ శబ్దంతో రోగులు పరుగులు తీశారు. ఆక్సిజన్ లీకేజీతో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సమీపంలో ఉన్న కాలిన రోగుల విభాగానికి ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయింది. కాలిన రోగుల విభాగంలో దాదాపు 15 మంది రోగులు కాలిన గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఇందులో ముగ్గురు రోగులు ఆక్సిజన్ తీసుకుంటున్నారు. చెట్టుకొమ్మ విరగడంతో రోగులకు ఆక్సిజన్ అందక పరిస్థితి విషమంగా మారింది. విషయం తెలుసుకున్న ఆసుపత్రి సూపరింటెండెంట్, సీఎస్‌ఆర్‌ఎంవో ఆదేశాల మేరకు నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 విమలమ్మ, హెల్త్ ఇన్స్‌పెక్టర్ టి.గోవిందు, హెడ్ నర్సులు, కాలిన రోగుల విభాగానికి చేరుకున్నారు. ఆక్సిజన్ మీద ఉన్న రోగులకు వెంటనే బల్క్ సిలిండర్‌ను అమర్చడంతో రోగులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎన్సీడీసీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధులను గుర్తించే నిమిత్తం చేస్తున్న ఎన్సీడీసీ 3.0 సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సంచార చికిత్స జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. సోమవారం కల్లపరి గ్రామంలో సర్వేను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. గ్రామంలో సర్వే నత్తనడకన సాగుతోందని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంపీహెచ్‌ఈవో నరసప్ప, సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, కోకిల పాల్గొన్నారు.

టెన్నిస్ క్రీడాకారిణికి అభినందన

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో మార్చి 20 నుంచి 23 వరకు జరిగిన జాతీయ టెన్నిస్ క్రీడల్లో పాల్గొని రెండు బంగారు పతకాలు సాధించిన ఇండియన్ డెఫ్ టెన్నిస్ క్రీడాకారిణి షేక్ జఫ్రీన్‌ను కలెక్టర్ పి.రంజిత్ బాషా అభినందించారు. జాతీయ టెన్నిస్ మహిళల సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో బంగారు పతకాలు సాధించిన షేక్ జఫ్రీన్‌ను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ షేక్ జఫ్రీన్ మార్చి 20 నుంచి 23 వరకు అహ్మదాబాదులో జరిగిన జాతీయ క్రీడల్లో పాల్గొని మహిళల సింగిల్స్ విభాగంలో బంగారు పతకం సాధించారని, అదేవిధంగా నంద్యాలకు చెందిన సాయి చందన్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో బంగారు పతకం సాధించడం అభినందనీయమన్నారు. తద్వారా 2025 నవంబరులో జపాన్‌లో జరగనున్న బదిరుల ఒలింపిక్స్‌లో పాల్గొనడానికి ఆమె అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, డీఆర్వో సీ.వెంకట నారాయణమ్మ, డీసీవో రామాంజనేయులు పాల్గొన్నారు.

కరాటే గ్రేడింగ్ బెల్టుల ప్రదానం

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని వడ్డెగేరిలో ఉన్న పీస్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో కరాటే బెల్టు గ్రేడింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయానంద్‌బాబు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు కలిసి కలర్ బెల్టులను ప్రదానం చేశారు. జిల్లా జపాన్ కరాటే అసోసియేషన్ కార్యదర్శి షకీల్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రజల సహకారం అభినందనీయం: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధికి సకాలంలో పన్నులు చెల్లిస్తూ ప్రజలు అందిస్తున్న సహకారం అభినందనీయమని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగర పాలక సమావేశ మందిరంలో రెవెన్యూ సిబ్బంది, అడ్మిన్, అమినిటీస్ కార్యదర్శులతో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గడిచిన ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ విభాగం సిబ్బంది, అడ్మన్లు, అమినిటీస్ కార్యదర్శులు పన్నుల వసూళ్ల కౌంటర్ల సిబ్బంది, డీపీవోలు పన్ను వసూళ్ల కోసం అహర్నిశలు కష్టపడ్డారన్నారు. సోమవారం ఒక్కరోజే రూ.65 లక్షలు పన్నులు చెల్లించారన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఆరవోలు జునైద్, ఇజ్రాయేల్, ఆర్ఐలు, ఏఈలు, అడ్మిన్లు, అమినిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ బోయ విజయ కుమార్ నాయుడు అధ్యాపకులకు సూచించారు. సోమవారం ఆర్‌యూలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమం జరిగింది.

హోరాహోరీగా గిరకబండి లాగుడు పోటీలు

సి.బెళగల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారందొడ్డి గ్రామంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని జిల్లాస్థాయి గిరబండ్ల పోటీలు, మహిళలకు ముగ్గులు, నీళ్ల బిందెల పోటీలు నిర్వహించారు. విజేతలకు నేడు బహుమతులను అందజేస్తామని కమిటీ పెద్దలు తెలిపారు. అలాగే నేడు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆలూరులో తాగునీటి కష్టాలు

- 20 రోజులుగా తాగునీరు లేదంటున్న ఎన్జీవో కాలనీవాసులు
- పడిగాపులు తప్పడం లేదని ఆవేదన



ఖాళీ బిందెలతో నీటి కోసం వేచి చూస్తున్న మహిళలు

ఆలూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని ఎన్జీవో కాలనీలో 20 రోజులుగా తాగు నీరు అందడం లేదు. దీంతో మహిళలకు ఖాళీ బిందెలతో బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. కాలనీలో మూడు లైన్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. రెండు లైన్లకు మాత్రం నీరు సరఫరా అవుతోంది. మూడో లైన్ పరిధిలోని 40 కుటుంబాలకు అందడం లేదు. పంచాయతీ సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు.

ప్రణాళిక లేకపోవడంతోనే..

పట్టణంలో 17వేల మంది నివసిస్తున్నారు. తాగు నీటి సరఫరాకు శివారులో ఎస్ఎస్ ట్యాంక్, 9 ట్యాంకులు ఉన్నాయి. అధికారులు నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని బాపురం, అగ్రహారం, ఆలూరు లోని ఎస్ఎస్ ట్యాంకులను ఎల్లెల్సీ నీటితో నింపుకోవాలి. అలాగే ప్రస్తుతం ఉన్న 9 ట్యాంకులు సరిపోవడం లేదు. ఆలూరు చెరువులో మరో ఎస్ఎస్ ట్యాంకు, అరికెరలో మరొకటి నిర్మిస్తే తాగునీటి ఇబ్బందులు ఉండవు. అధికారులు ఈ దిశగా ప్రణాళిక వేసి, అమలు చేస్తే సమస్య తీరే అవకాశం ఉంది.

తాగు నీరు కొంటున్నాం

మా కాలనీకి 20 రోజులుగా తాగునీరు రావడం లేదు. డబ్బులు చెల్లించి వాటర్ క్యాన్లను కొంటున్నాం. ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. **- రామలక్ష్మి ఎన్జీవో కాలనీ ఆలూరు**

పన్నులు చెల్లిస్తున్నా తాగునీరు రావడం లేదు

పంచాయతీకి అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నప్పటికీ నీరు మాత్రం సరఫరా కావడం లేదు. ఎన్నిసార్లు చెప్పినా అంతే. నీళ్లు వదిలినా, గంటకు మించి వదలడం లేదు. అధికారులు స్పందించాలి

. **- నీలమ్మ ఆలూరు**

నేడు మంత్రి నిమ్మల రాక

మద్దికెర, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం మద్దికెరకు వస్తున్నట్లు టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు సోమవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు హంద్రీనీవా కాలువను పరిశీలిస్తారని, ఎమ్మెల్యే శ్యాంబాబు హంద్రీనీవా కాలువ వెంట పెరవలి, తుగ్గలి పత్తికొండ పందికోన వరకు వెళ్తారని తెలిపారు.

పన్ను చెల్లింపుపై రాయితీ

ఆదోని టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నులను ముందస్తుగా చెల్లించే వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ప్రకటించిందని మున్సిపల్ కమిషనర్ కృష్ణ సోమవారం తెలిపారు. 2025-26 సంవత్సరానికి ఈ నెల 30లోపు ఆస్తి పన్నును ఏకమొత్తంలో చెల్లించే వారికి ఈ రాయితీ లభిస్తుందన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఎస్సీ మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని న్యాక్ ఇన్‌చార్జి బిజీ ఉలుగన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 30 మందికి అవకాశం ఉందని, ఆర్ట్స్ కళాశాల రహదారిలోని న్యాక్ కేంద్రంలో ఈనెల 14లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. వివరాలకు 9908554147, 9397031486 నబర్లను సంప్రదించాలని కోరారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి



విరాళం ఇస్తున్న చైర్ పర్సన్ సావిత్రి

ఆదోని, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఐకమత్యంతో ముందుకు సాగితే అభివృద్ధికి అవకాశం ఉంటుందని రజక కార్పొరేషన్ చైర్ పర్సన్ సావిత్రి అన్నారు. రజక సంఘం ఆధ్వర్యంలో పొలిమేరలోని రాంజల చెరువు సమీపంలో కల్యాణ మండపం నిర్మాణానికి 1.99లక్షల విరాళం సోమవారం అందించారు. నాయకులు రామన్న, హుసేని, సతీష్, గోవిందప్ప, నరసింహ రాజు, నరసప్ప, ఉరుకుంద, నగేష్, రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న వాల్మీకులు, తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తుగ్గలిలో సోమవారం వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠంచారు. టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, బీవీఎస్ అధ్యక్షుడు అంజి, మాజీ ఎంపీటీసీ వల్లె వెంకటేశ్ తదితరులు వాల్మీకి పూజలు వేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

సారా, బెల్లం స్వాధీనం

ఆదోని, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బోయగేరిలో 20 లీటర్ల సారాతో పాటు 40 కేజీల బెల్లాని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్లా తెలిపారు. సారా తయారీకి ఉపయోగించే బెల్లాన్ని గురురాజు ట్రేడర్స్ గురురాజు యజమాని బోయ శివ అనే వ్యక్తికి విక్రయిస్తుండటంతో ఇరువురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్పీలను విధుల్లోకి తీసుకోవాలి



మాట్లాడుతున్న మెప్మా రిసోర్స్ పర్సన్లు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెప్మా కార్యాలయంలో తొలగించిన రిసోర్స్ పర్సన్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని లక్ష్మి, మీనాక్షి, గుల్జర్, జయలక్ష్మి, హేమలత లలితమ్మ కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 2017లో నాటి టీడీపీ ప్రభుత్వం 29 మందిని ఆర్పీలుగా తీసుకుందన్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అకారణంగా విధుల నుంచి తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను విధుల్లోకి తీసుకోవాలని ఎమ్మెల్యే పార్థసారథి లేఖ కూడా ఇచ్చారన్నారు. పురపాలక అధికారులు స్పందించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచరించారు.

బాధితులకు న్యాయం చేయాలి



ఎస్ఐని సన్మానిస్తున్న బత్తిన వెంకట్రాముడు

తుగ్గలి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయాలని జడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, మాజీ ఎంపీపీ కొమ్మె వెంకటేశ్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్ కోరారు. సోమవారం జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జునను సన్మానించారు. లక్ష్మన్న, నాయక్ ఉన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రోగుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు బసాపురం లింగప్ప కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆరోగ్యశ్రీ పరిధిలో ఉచితంగా చేయాల్సిన చికిత్సకు డబ్బు వసూలు చేస్తున్నారన్నారు. చరణ్, వీరేష్, నాగరాజు పాల్గొన్నారు.

దేవదాయ అధికారిపై చర్యలు తీసుకోవాలి

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలంలో పని చేసిన దేవదాయ అధికారి శ్రీనివాసులు చర్యలు తీసు కోవాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేంద్ర నాయుడు కోరారు. సోమవారం కలెక్టర్‌కు ఆయన వినతి పత్రం సమర్పించారు



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న మహేంద్ర నాయుడు

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించండి

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



దివ్యాంగుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించయాలని, అర్జీదారులను సంతృప్తిపరచాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో అర్జీలను స్వీకరించారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని

- కౌతాళం మండలం కామవరం గ్రామానికి చెందిన శివలింగప్ప తనకు వృద్ధాప్య పింఛన్, ఇంటి పట్టా మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.
- ఆదోని మండలం దానాపురం గ్రామం బీసీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఉమాదేవి, ఖాసింబీ, శివమ్మ, తులసి అర్జీ సమర్పించుకున్నారు.
- కౌతాళం మండలం వల్లూరు గ్రామానికి చెందిన ఆనంద్ తనకు దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని అర్జీ ఇచ్చారు.
- సర్వే నెం. 159లో 8.06ఎకరాల భూమి వారసత్వంగా సక్రమించిందని, సర్వే చేసి హద్దులు చూపాలని ఆదోని పట్టణానికి చెందిన సూర్యపోగు మోజెస్ అర్జీ సమర్పించుకున్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డీఎల్పీవో నూర్జహాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, డిప్యూటీ డీఎంహెచ్వో సత్యవతి, డీటీ గుండాల నాయక్, వలి బాషా పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ దినోత్సవం



ఆదోనిలో వైద్య సిబ్బంది ర్యాలీ

ఆదోని టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యపరమైన సమస్యల పరిష్కారానికే డబ్ల్యూహెచ్‌వో ఏర్పాటు చేశారని ఐఎంఏ సభ్యుడు డా. గోపీనాథ్, ఆదోని బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి అన్నారు. సోమవారం పట్టణంలో వైద్యులు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరుపుకున్నారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉంటేనే సమాజం సుభిక్షంగా ఉంటుందన్నారు. వైద్యులు మధుసూదన్, రామామణి, కృష్ణదేవరాయలు, గోపీనాథ్, గంగాధర్ రావు, హరీష్, అనూష, మురళి మోహన్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ర్యాలీ

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యవతి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆహార నియమాలు పాటించని కారణంగా రోగాల భారిన పడుతున్నారన్నారు. యూపీహెచ్‌సీ డాక్టర్లు అనిల్, వినోద్, మహేష్, టీబీ సిబ్బంది, ఎంపీహెచ్ఎస్ బాబు రాజు, ఇతర విభాగాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మద్దికెర: ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని మద్దికెరలో ర్యాలీ నిర్వహించారు. తల్లి, నవజాత శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సుంకాలు తగ్గించాలి

వెల్దుర్తి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారుల నుంచి వసూలు చేస్తున్న సుంకాలు తగ్గించాలని ఏఐటీయూసీ నాయకులు, చిరు వ్యాపారులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామ పంచాయతీకి కార్యదర్శి లక్ష్మినాథ్‌కు వినతి పత్రం అందజేశారు. కొత్తగా వేలం దక్కించు కున్న కాంట్రాక్టర్లు గతంలో కన్నా అంధికంగా వసూలు చేస్తున్నార న్నారు. బి.మాధవ స్వామి, కే.రామాంజనేయులు, కె.అనిల్ పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న చిరు వ్యాపారులు

జూదరుల అరెస్టు

తుగ్గలి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంపల్లి గ్రామ శివారులో సోమవారం పేకాటరాయుళ్లను అరెస్టు చేశామని ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. 9 మందిని అదుపులోకి తీసుకుని రూ.19,440లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు : ఈవో

పత్తికొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తేరుబజార్‌లో దుకాణదారులు కాలువదాటి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఈవో నరసింహులు హెచ్చరించారు. సీసీ రోడ్డు లేకపోవడంతో దుకాణదారులు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించేవారు. మూడు నెలల క్రితం ఎమ్మెల్యే కేఈ చొరవతో ఆక్రమణలకు తొలగించి సీసీ రహదారిని ఏర్పాటు చేశారు. కాగా సోమవారం ఓ దుకాణదారుడు కాలువపై నిర్మాణాలు చేపట్టడంతో పంచాయితీ సిబ్బంది అడ్డుకున్నారు

మద్యం విక్రేత అరెస్టు

ఆదోని రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన మేకల బసవరాజు మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఇస్వి ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. వివరాల మేరకు.. నిందితుడు తన హోటల్‌లో మద్యాన్ని విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు.. సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. 22 మద్యం, ఐదు బీర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ తెలిపారు.

విజేతగా బొమ్మిరెడ్డిపల్లె వృషభాలు

వెల్దుర్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దనగట్టు గ్రామంలో సోమవారం ఒక్క బండి గిరక పోటీలు నిర్వహించారు. బొమ్మిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మనోజ్ వృషభాలు విజేతగా నిలిచాయి. రెండు, మూడు స్థానాల్లో బోయినపల్లెకు చెందిన దుప్పలి వెంకటేశ్, కాంతారెడ్డి వృషభాలు నిలిచాయి.

చేయి తడిపితేనే పని

హొళగుంద, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఓ కంప్యూటర్ ఆపరేటర్ యథేచ్ఛగా వసూలు చేస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయంలో పనులు కావాలంటే ఆయన చెయ్యి తడపాల్సిందేనని రైతులు అంటున్నారు. అడంగల్, ఆర్‌వోఆర్, మ్యూటేషన్ పాస్‌బుక్‌ల కోసం వచ్చే రైతులు వద్ద మామూళ్లు ఇవ్వందే పనులు కావడం లేదని, తహసీల్దార్ డిజిటర్ కీ కూడా ఆయన వద్దే ఉండడంతో అడిగినంత ఇచ్చుకోక తప్పడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము కూడా చేయి తడపందే పనులు కావడం లేదని వీఆర్వోలు అంటున్నారు. తహసీల్దార్‌కు బినామీగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

- ఈ విషయంపై తహసీల్దార్ నిజాముద్దీర్‌ను వివరణ కోరగా విచారణచేసి, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



హొళగుంద తహసీల్దార్ కార్యాలయం

స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోని టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆవోపా ఆధ్వర్యంలో సోమవారం చిన్నారు లకు రోగ నిరోధక శక్తిగల స్వర్ణామృత ప్రాసనం మందును పంపిణీ చేశారు. సంస్థ పట్టణ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా మాట్లాడుతూ 168మంది చిన్నారులకు మంద తాపించామని, సౌజన్య కర్తగా వ్యవహరిస్తున్న కాకుబాల్ నాగేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రఘు కోశాధికారి, యాతగిరి వెంకటేశ్వర్లు, రత్నయ్య, వెంకటేష్ బాబు, మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమతాశ్రీ, శ్రీదేవి పాల్గొన్నారు.



పిల్లలకు మందు తాపిస్తున్న ఆవోపా సభ్యులు

సీతారాముల రథోత్సవం

పత్తికొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నహుల్తి గ్రామంలో సోమవారం సీతారాముల రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఏటా శ్రీరామనవమి మరుసటిరోజు గ్రామంలో రథోత్సవం నిర్వహిస్తారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు రథోత్సవాన్ని ప్రారంభించారు



రథోత్సవంలో భక్తులు

శవ రాజకీయాలు మానాలి

ఆలూరు, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు శవ రాజకీయాలు మానాలని జనసేన ఐటీ కో- ఆర్డినేటర్ రంజిత్ కుమార్ సూచించారు. సోమవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మాట్లాడుతూ తెర్నేకల్లులో విద్యుదాఘాతంతో ప్రతాప్ అనే వ్యక్తి మరణిస్తే కూటమి ప్రభుత్వంపై నిందలు మోపడం సరి కాదన్నారు. బాధిత కుటుంబానికి ఆలూరు జనసేన ఇన్‌చార్జి వెంకప్ప రూ.1.50లక్షలు ఆర్థిక సాయం చేశారన్నారు. చత్రపతి, మున్నా, సన, యశోద, రంగస్వామి పాల్గొన్నారు.

ముస్లింల ర్యాలీ

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ పట్టణంలో సోమవారం ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ఆర్అండ్‌బీ గెస్టు హౌస్ నుంచి ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చారు.



ఎంపీడీవోకు రాజీనామా ఇస్తున్న ప్రమీలమ్మ

ఉప సర్పంచ్ రాజీనామా

మద్దికెర, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ప్రమీలమ్మ తన పదవికి రాజీనామా చేశారు. సోమవారం కొండయ్యకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. పంచాయతీలో 18 వార్డులు ఉండగా వైసీపీ మద్దతుదారులు 12 వార్డుల్లో విజయం సాధించారు. ఈ నెల 4వ తేదీన పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్‌కు ఉప సర్పంచ్ అవిశ్వాసం పెట్టాని వార్డు మెంబర్లు ప్రతిపాదనలు అందజేయడంతో పార్టీ అధినాయకత్వం సూచన మేరకు ఆమె రాజీనామా చేసినట్లు తెలిపారు. వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఫక్కీరప్ప, సర్పంచ్‌లు బురుజుల విజయుడు, రాజగోపాల్ రెడ్డి, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, ఎంపీటీసీ ఆంజనేయులు ఉన్నారు.

ఆదోని పశువుల సంతలో వసూళ్ల దందా

- ఒక్కో పశువుకు రూ.300లు..
- కాంట్రాక్ట్ ముగిసినా వసూళ్లు



సంతకు పశువులను తెచ్చిన రైతులు



పన్నుల రశీదు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంతంలోని ఎమ్మిగనూరు బైపాస్ డంపింగ్ యార్డ్ సమీపంలో ప్రతి శుక్రవారం పశువుల సంత నిర్వహిస్తారు. ఇక్కడికి ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం, డోన్, కోడుమూరు, గుత్తి తదితర దూర ప్రాంతాల నుంచి రైతులు పశువులను తీసుకొస్తారు. అయితే ఇక్కడి సిబ్బంది తమ నుంచి అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

ప్రైవేట్ వ్యక్తులచే దందా

పశువుకు (ఎద్దు, ఆవు, బర్రె) రూ.100లు వసూలు చేయాలి. అయితే ఇక్కడ ప్రైవేటు వ్యక్తులు పశువుకు రూ.150లు వసూలు చేయడమే కాకుండా, మరోసారి కొనుగోలు చేసిన వ్యక్తి నుంచి కూడా మరో రూ.150లు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీతో మొత్తం కలిపి రూ.300లు అవుతతుంది. అయితే ఇందుకు ఇచ్చే రశీదుపై రూ.100లు మాత్రమే ఉంటుంది. అలాగే తేదీ, వసూలు చేసిన వారి సంతకం కూడా ఉండి. ఈ దందాను ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఫొటో తీస్తుండగా పక్కనే ఉన్న సచివాలయ సిబ్బంది పరుగున వచ్చి వసూలు చేస్తున్న ప్రైవేటు వ్యక్తుల నుంచి బ్యాగు, చీటి పుస్తకం లాక్కుని ఉడాయించారు.

వేలం కాంట్రాక్ట్ ముగిసినా..

మార్చి 31వ తేదికిస్తూ వసూళ్లు చేసే కాంట్రాక్ట్ గడువు ముగిసినా అలాగే వసూళ్ల దందా సాగుతోంది. సదరు గొర్రెల సంత వేలం పాటదారులు తమ పలుకుబడితో ఉదయమే వచ్చి రైతుల నుంచి వసూళ్లు చేస్తున్నారు. పురపాలక సిబ్బంది మాత్రం దందా ముగిశాక తీరికగా వస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

గొర్రెల సంతలోను ఇదే పరిస్థితి

గొర్రెల సంత కూడా ఇక్కడే నిర్వహిస్తారు. పురపాలక అధికారులు నిర్దేశించిన మొత్తాన్ని మాత్రమే వసూలు చేయాలని గెజిట్లో ఉంది. కానీ ఇక్కడ ఇవేవీ పాటిండం లేదు. జీవానికి రూ.20ల ప్రకారం వసూలు చేయాలి. అలా కాకుండా రూ.50లు వసూలు చేస్తున్నారు. పశువుల సంత, గొర్రెల సంతలో రైతుల నుంచి వసూలు చేసిన సొమ్ము నిజంగా ప్రభుత్వానికి వెళుతుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనికి అధికారులే సమాధానం చెప్పాల్సి ఉంది.

సిబ్బందిని ఏర్పాటు చేశాం

పశువుల, గొర్రెల సంతలో కిస్తూ వసూళ్లకు పురపాలక, సచివాలయ సిబ్బందిని 15 మందిని ఏర్పాటు చేశాం. కాంట్రాక్టర్లు ఎవరు కూడా వసూలు చేయడానికి వీల్లేదు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. **- కృష్ణ, పురపాలక కమిషనర్, ఆదోని**

12న క్రికెట్ టోర్నమెంట్

ఆలూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో, బీజేఆర్ స్కూల్ ఆధ్వర్యంలో 12న క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కరెస్పాండెంట్ రవి కుమార్, బూర్ల పవన్ సోమవారం తెలిపారు. ఆసక్తిగల టీటీంలు నెల 11వ తేదీలోగా 8106820699నెంబర్‌కు రూ.1,500 ఫోన్‌పే చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజినేయులు, జయమ్మ దంపతులు బహుమతులు ఇస్తారన్నారు.

సమ్మెటివ్-2 పరీక్షలు ప్రారంభం

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వార్షిక పరీక్షలు (సమ్మెటివ్ అసెస్మెటివ్-2) సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్ష నిర్వహించామని, ఈనెల 17వ తేదీ వరకు పరీక్షలు ఉంటామని ఎంఈవో-2 శ్రీనివాసులు తెలిపారు. పబ్లిక్ పరీక్షల తరహాలో ఓఎంఆర్‌సీట్‌తో 20 పేజీల బుక్‌లెట్‌లో జవాబులు రాయల్సి ఉంటుందన్నారు. పరీక్షలు ముగిశాక ఆన్‌లైన్‌లో మార్కులు పొందుపరిచి ప్రోగ్రెస్ కార్డును అందజేస్తామని తెలిపారు.

గోనెగండ్లకు నీటి కష్టాలు

● కూతవేటు దూరంలో గాజులదిన్నె ప్రాజెక్టు
● ఏళ్లుగా వీడని తాగునీటి సమస్య

గోనెగండ్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు గోనెగండ్లకు కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ స్థానిక ప్రజల దాహార్తి మాత్రం తీర్చడం లేదు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారినా గోనెగండ్ల ప్రజలకు నీటి కష్టాలు మాత్రం తీరడం లేదు. గ్రామంలో 25వేల జనాభా ఉంది. 1981 కొళాయిలు ఉన్నాయి. అయితే గ్రామానికి తాగునీరు అందించేందుకుగాను ప్రభుత్వం ఒక సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌ను ఏర్పాటు చేసింది. ఎల్లెల్సీ నీటితో ఎస్ఎస్ ట్యాంక్‌ను


పూర్తయిన ఓహెచ్ఆర్ ట్యాంక్

నింపుతారు. అయితే గ్రామంలో ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు లేని కారణంగా నీటి సరఫరా చేయడం కష్టంగా మారింది. దీంతో నాలుగు రోజులకు ఒక్కసారి నీరు విడుదల అవుతుంది. దీంతో గ్రామస్థులు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. తాగునీటి కష్టాలను తీర్చేందుకు గాను ప్రభుత్వం గత ఐదేళ్ల క్రితం జలజీవన్ మిషన్ కింద నిధులు విడుదల అయ్యాయి. కేంద్రప్రభుత్వం 50 శాతం వాట కింద, రాష్ట్ర


గోనెగండ్ల ఎస్ఎస్ ట్యాంక్

ప్రభుత్వం 50 శాతం వాట కింద విడుదల చేయాల్సి ఉంది. అప్పటి వైసీపీ ప్రభుత్వం తన వంతు 50 శాతం నిధులను విడదల చేయకపోగా కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల అయిన నిధులను ఇతర పనులకు మళ్లించడంతో పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. గత రెండు నెలల క్రితం పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు వచ్చాడు. గోనెగండ్లలో పనులకు గాను రూ. 3.51 కోట్లు మంజూరు అయ్యాయి. ఒక ఓహెచ్ఆర్ ట్యాంక్ మాత్రమే నిర్మాణం పూర్తి అయింది. ఇంకా రెండు ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు, పైప్‌లైన్ పనులు పూర్తి కావాల్సి ఉంది. గోనెగండ్లలోని రెండు కాలనీలో జలజీవన్ మిషన్ పైప్‌లైన్‌లు వేశారు. కానీ ఇంకా నీటి విడుదల కాలేదు. ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు పూర్తి అయితేనే నీటి విడుదలకు సాధ్యం అవుతుంది. అధికారులు స్పందించి పనులు త్వరగా చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

త్వరలో పనులు పూర్తి చేస్తాం

గ్రామంలో బీసీకాలనీ, లక్ష్మీపేట కాలనీలలో పైప్‌లైన్ పనులు పూర్తి కావస్తున్నాయి. మరి కొన్ని రోజులలో ఓహెచ్ఆర్ ట్యాంక్‌లను పూర్తి చేసి పైప్‌లైన్ పనులను కూడా పూర్తి చేసి తాగునీరు అందిస్తాం.
- శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెగండ్ల

అధికంగా వసూలు చేస్తున్నారు

కమిషనర్‌కు ఫిర్యాదు


కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న చిరువ్యాపారులు, సీపీఐ ఎంఎల్ నాయకులు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోజువారి మార్కెట్‌లో రుసుములు అధికంగా వసూలు చేస్తున్నారని సీపీఐ నాయకులు ఆరోపించారు. సోమవారం సీపీఐ ఎంఎల్ న్యూడమోక్రసి పార్టీ ఆధ్వర్యంలో సోమవారం చిరువ్యాపారులు కమిషనర్ గంగిరెడ్డికి ఫిర్యాదు చేశారు. మున్సిపల్ గెజిట్ ప్రకారం పట్టణంలోని ప్రధాన రహదారుల పక్కన తోపుడు బండ్లకు రూ. 20లు వసూలు చేయాల్సి ఉండగా రూ. 30లు వసూలు చేస్తున్నట్లు చిరువ్యాపారులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ వెంటనే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అనంతరం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకుడు ప్రసాద్, చిరువ్యాపారులు మాబాషా, రహంతుల్లా, నజీర్, అహ్మద్, హుసేన్ సాబ్ పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైసీపీ బలోపేతానికి కృషి చేస్తానని పట్టణ ఉపాధ్యక్షుడు కొటకొండ నరసింహు లు అన్నారు. సోమవారం కొటకొండ నరసింహులు, కౌన్సిలర్ పద్మను పార్టీ కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ మాజీ ఎంపీ బుట్టా రేణుకమ్మకు, బుట్టా నీలకంఠకు ధన్యావాదాలు తెలిపారు. అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. కార్యక్రమంలో వీరేష్, అడివన్న, బాషా, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న రామకృష్ణ

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అక్కమ్మ తోట రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక శ్రీ సుశీలమ్మ దేవాలయ కల్యాణ మండపంలో అసెంబ్లీ నియోజకవర్గ కో కన్వీనర్ తోగట నరసింహులు అధ్యక్షతన కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, పార్టీ బలోపేతం దిశగా సభ్యత్వాలను ముమ్మరం చేయాలన్నారు. బీజేపీ మోదీ నాయకత్వంలో సాధించిన విజయాలను, ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు చంద్రమౌళి, జిల్లా ఇన్‌చార్జి అంకాల్ రెడ్డి, జట్టెప్ప, శివ పాల్గొన్నారు.

నరసింహస్వామికి మహాభిషేకం

మంత్రాలయం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు పూర్వాశ్రమంలో తండ్రి అయిన రాజా ఎస్ గిరిరాజాచార్ నివాసంలో లోక కల్యాణార్థం, ప్రపంచశాంతి కోసం షోడశబాహు(పదహారు చేతులు) నరసింహస్వామికి బంగారు నాణేలతో అభిషేకం చేశారు. సోమవారం చైత్రమాస దశమి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారు మంటపంలో షోడశబాహు నరసింహస్వామికి మహాభిషేకం చేశారు. అలాగే మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో విశేష అభిషేకం చేసి హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో పండితకేసరి విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు శ్రీపతిఆచార్, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, అనంతపురాణిక్, రవికులకర్ణి, విజయీంద్ర ఆచార్, ద్వారపాలక ఆనంతస్వామి, రాజాఎస్ అప్రమేయాచార్, కృష్ణ కౌసిక్, డాక్టర్ సుధీంద్రాచార్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో స్వర్ణ పల్లకోత్సవం

మంత్రాలయం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో రాఘవేంద్రుడి స్వర్ణ పల్లకోత్సవం రమణీయంగా నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం చైత్రమాస దశమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మఠం పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్ఠించి ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ చేశారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేషపూజలు చేశారు.

నేడు పూజలు నిలుపుదల

మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో మంగళవారం ఏకాదశి సందర్భంగా బృం దావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, పరిమళ ప్రసాదం,టెంకాయ కొట్టడం బంద్ చేస్తారు. పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో కేవలం బృందా వనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇస్తారు. రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకొనే అవకాశం మాత్రమే శ్రీ మఠం అధికారులు కల్పించనున్నారు.

పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలి

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని ప్రముఖ ట్రైనర్లు కృష్ణచైతన్యరెడ్డి, వంశీకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీటెక్ చదివే విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఉద్యోగ అవకాశాలు ఏర్పచుకోవాలన్నారు. ఎక్కడ ఏ క్యాంపస్ నియామకాలు జరిగినా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు


పెద్దకడుబూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకడబూరు గ్రామంలోని వ్యక్తి పై దాడి చేసి గాయపరిచినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మల్లికార్జున, రామకృష్ణపై శ్రీ ఆంజినేయులు దురుసుగా ప్రవర్తించి కట్టెతో దాడి చేసి గాయపరిచాడు. ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేంద్రంపై ఒత్తిడి తేవాలి


మాట్లాడుతున్న వాల్మీకి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మన్న

మంత్రాలయం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా కేంద్రంపై రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి తేవాలని ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బి. లక్ష్మన్న అన్నారు. సోమవారం ఆయన తన నివాసంలో విలేక రులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 50 లక్షల మంది వాల్మీకులు ఉన్నారని, గత 40 ఏళ్లుగా వాల్మీకులకు న్యాయం చేయాలని పోరాటాలు చేస్తూ, సభలు నిర్వహిస్తూ, వాల్మీకులను ఐక్యత పరుస్తూ, అన్ని ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో ఎస్టీ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపించారని, కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షాతో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు మాట్లాడి ఎస్టీ బిల్లును పాస్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు నాగరాజు, పూర్ణ నాయుడు, వెంకటేశ్, సత్తా, మల్లేష్, శివ, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన టీడీపీ నాయకులు


ఎస్ఐని కలిసిన దేశాయి మాధవరావు

నందవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నందవరం ఎస్ఐ కేశవ్‌ను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ దేశాయి మాధవరావు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో నెలకొన్నన సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు ఈరన్న, మల్లికార్జున పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని జయప్రదం చేయాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ కన్వీనర్ దేవ సహాయం కోరారు. సోమవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14న ఉదయం 10గం టలకు పట్టణంలో భారీ ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం సభలో వక్తలు ప్రసంగిస్తారన్నారు. ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ పరెగెల భాస్కర్, వైస్ చైర్మన్ బుడగ జంగాల రుద్రాక్షల పెద్దయ్య, కదిరి కోట అదెన్న పాల్గొన్నారు.

శాశ్వత అన్నదాన పథకానికి విరాళం


దాతలకు స్వామి వారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

కౌతాళం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి సోమవారం ఓ భక్తుడు రూ.50 వేల నగదును విరాళంగా అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో విజయరాజు తెలిపారు. ఈ సందర్భంగా దాత జులకల్ పెద్ద సోమన్న, మాణిక్యమ్మ కుటుంబ సభ్యులకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. వీరి వెంట ఆలయ సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ ఉన్నారు.

ప్రహ్లాద మృతి టీడీపీకి తీరని లోటు

జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



నివాళి అర్పిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

కోసిగి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు భక్త ప్రహ్లాద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం టీడీపీకి తీరని లోటు అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మిగనూరు-కోటేకల్ మధ్య జరిగిన ప్రమాదంలో ప్రహ్లాద అక్కడికక్కడే మృతి చెందగా.. ఆయన తల్లి మంగమ్మ స్వల్ప గాయాలతో బయటపడింది. ఎమ్మిగనూరులో పోస్టుమార్టం అనంతరం స్వగ్రామం కోల్‌మాన్‌పేటకు భౌతికకాయాన్ని తరలించారు. తిక్కారెడ్డి రాఘవేంద్రరెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, నాయకులు పల్లెపాడు రామిరెడ్డి, ఈరన్న, భరద్వాజశెట్టి, అమర్నాథ రెడ్డి, వక్రాణి వెంకటేశ్, అయ్యన్న, తోవి రామకృష్ణ, చిన్నతాయన్న పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా పారిశుధ్య పనులు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హాబిబుల్లా కాలనీలో మునిసిపల్ సిబ్బంది తూతూ మంత్రంగా పారిశుధ్య పనులు చేపట్టారు. కాలనీలో మురుగు, చెత్తాచెదారం పేరుకపోయిందని 'ఆంధ్రజ్యోతి' 'ఇళ్ల మధ్య మురుగు' అనే శీర్షికతో కథానాన్ని ప్రచురించింది. దాంతో అధికారులు స్పందించి తూతూ మంత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. వాస్తవంగా మురుగు నీటిని మోటార్ ద్వారా తొలగించి, గుంతను పూడ్చివేయాలి, కానీ పరిసరాలలో చెత్తాచెదారాన్ని తొలగించారు.

కోసిగి ఎక్సైజ్ ఎస్ఐగా నాగేంద్ర

కోసిగి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కోసిగి ఎక్సైజ్ ఎస్ఐగా నాగేంద్ర పదోన్నతిపై వచ్చారు. సోమవారం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నవోదయం 2.0ను విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఎక్సైజ్ ఎస్ఐ కార్తిక్ సాగర్, ఎక్సైజ్ సిబ్బంది మునిరంగడు, భరత్, తదితరులు ఉన్నారు.

వైభవంగా సీతారాముల రథోత్సవం



హెచ్.మురవణి, బుడుములదొడ్డిలో సీతారాములు, ఆంజనేయ స్వామి రథోత్సవానికి హాజరైన జనం

పెద్దకడుబూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్. మురవణి గ్రామంలో సీతారాముల స్వామి రథోత్సవాన్ని గ్రామ స్థులు వైభవంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే స్వామి వారికి జలాభిషేకం, పుష్పాభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రం స్వామివారి రథోత్సవాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో సత్యన్నగౌడు, జనార్దన్, రామలింగ, బేబి, సురేష్ పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ నిరంజన్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

బుడుములదొడ్డిలో ఆంజనేయస్వామి రథోత్సవం

కౌతాళం: మండలంలోని బుడుములదొడ్డిలో ఆంజనేయస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్యంగా బదినేహల్‌లో మల్లికార్జున స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం గ్రామ పెద్దల ఇంటి నుంచి మేటి కుంభం దేవాలయానికి చేరి ప్రత్యేక పూజలు అనంతరం భక్తుల మధ్య రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు, బుడుములదొడ్డిలో సీతారాముల విగ్రహాల ను రథంపై ఉంచి లాగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ అశోక్ కుమార్ పోలీసు బందోబస్తును చేపట్టారు.

రుణాల మంజూరులో నిర్లక్ష్యం తగదు

మంత్రాలయం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అర్హులైన బీసీ లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహించవద్దని బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్, బీఎస్ఎస్ జిల్లా కార్యదర్శి బోయ విజయ్ అన్నారు. సోమవారం మంత్రాలయం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న ఈవోఆర్‌డీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల్లో ఉన్నత విద్య చదువుకుని వ్యాపారంలో నైపుణ్యం ఉన్న ఎంతో మంది బీసీలకు ఆర్థిక లబ్ధి చేకూర్చే విధానంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. దరఖాస్తులు చేసుకుని మూడు నెలలవుతున్నా ఇంత వరకు కాలయాపన చేయడం సరికాదన్నారు. వెంటనే బ్యాంకుల ద్వారా బీసీ లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే బీఎస్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్ఎస్ జిల్లా నాయకులు దేవపుత్ర, నరసింహస్వామి, రామకృష్ణ, బోయ రామాంజనేయులు, శివరాముడు, రాధమ్మ, రంగన్న, తిప్పమ్మ, లక్ష్మన్న పాల్గొన్నారు.


ఈవోఆర్‌డీకి వినతి పత్రం ఇస్తున్న బీఎస్ఎస్ నాయకులు

బడి.. అమ్మ ఒడి పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ లక్ష్మణ్, డాక్టర్ వీడీ రాజగోపాల్

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన గణిత ఉపాధ్యాయుడు, బాలసాహిత్యవేత్త బాలబందు గద్వాల సోమన్న రచించిన బడి అమ్మ ఒడి పుస్తకాన్ని హైదరాబాద్‌లో పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్, వాల్మీకి సాహిత్య, సాంస్కృతిక సేవాసంస్థ గౌరవాధ్యక్షుడు డా వీడీ రాజగోపాల్, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వపు రిజిస్ట్రార్ ఆచార్య టీ గౌరిశంకర్, విశ్రాంత అటవీశాఖ ఏఎల్ కృష్ణారెడ్డి, పలువురు కవులు, సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రచయితను అభినందించారు.

పోరాటంతోనే దళిత కాలనీలో సీసీ రోడ్డు

మంత్రాలయం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితంగానే మండలంలోని చిలకలడోన గ్రామంలో సీసీ రోడ్డు వేశారని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు గుండు పోగుల నేపాల్ అన్నారు. ఎస్సీ కాలనీలో సగం సీసీ రోడ్డు వేసి వదిలే శారని, దీంతో సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి ఫిర్యాదు చేశామన్నారు. వారు స్పందించడంతో మరలా సీసీ రోడ్డు పనులు సోమవారం ప్రారంభించారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుజ్జుల నాగమ్మ, హనుమన్న, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రభాకర్, దావీదు, సత్యవేదమ్మ పాల్గొన్నారు.


చిలకలడోనలో జరుగుతున్న రోడ్డు పనులు

అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శం

● కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు
● మాధవరంలో నాటక ప్రదర్శనకు స్థల పరిశీలన పూర్తి


మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు

మంత్రాలయం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శమని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనందబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు హెచ్.జయరాజులు అన్నారు. సోమవారం మంత్రాలయం మండలంలోని మాధవరం ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ నాటక ప్రదర్శన కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రజలకు తెలిసే విధంగా నాటక ప్రదర్శన నిర్వహిస్తారన్నారు. కేవీపీఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు అంజి, సురేష్, మారెప్ప, ఇస్రాయేల్, హనుమంతు, వీరేష్, ఇషాక్ ఉన్నారు.

నేటి నుంచి ఐరన్‌బండలో దేవర

గోనెగండ్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో మంగళవారం సుంకులాపరమేశ్వరి, మారెమాంబ దేవర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

కౌతాళం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సకాలంలో పంచాయతీకి పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ పాల్‌దినకరన్, పంచాయతీ కార్యదర్శి ప్రకాశం కోరారు. సోమవారం కౌతాళం పంచా యతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ వందశాతం పన్నులు వసూలు చేయాలన్నారు.